

RNI NO: APTEL/25/A4894

ఉషశ్రీ
USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిస్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 82 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిల్ల మోహన్ | మంగళవారం 02 - 06 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

కందకాలు తవ్వారు

మీటింగ్ ల నుంచి జనం వెళ్లిపోకుండా కందకాలు తవ్వారు.....

ప్రతి పౌరుడికి డిజిటల్ ఆరోగ్య రికార్డుల ఏర్పాటు

పేదల కోసం తొలి రోజు నుంచే పనిచేస్తున్న ప్రభుత్వం

పింఛన్లపై ఏడాదికి రూ.32 వేల కోట్లు వ్యయం

62.34 లక్షల మందికి రూ.2,729 కోట్ల పింఛన్లు

రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ

23 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం ధీమా

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భయానక వాతావరణం ఉండేదని, బహిరంగ సభలకు వచ్చిన ప్రజలు మధ్యలో వెళ్లిపోకుండా అడ్డుకోవడానికి ఏకంగా కందకాలు తవ్వి, ఫెన్సింగ్‌లు వేసి నిర్బంధించే దుస్థితి ఉండేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యానించారు. అలాంటి విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన ప్రజలు తమ ఓటుతో రాష్ట్రానికి విముక్తి కల్పించారని, ఆ రోజు చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పాలకులు బటన్ నొక్కి పైశాచిక ఆనందం పొందేవారని, ప్రజల కష్టసుఖాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రజలతో మమేకమవుతూ, నేరుగా వారి వద్దకే వెళ్లి సేవలు అందిస్తోందని స్పష్టం చేశారు.

పేదలే తొలి ప్రాధాన్యం - పెంచిన పింఛన్లే

ప్రతి పౌరుడికి డిజిటల్ ఆరోగ్య రికార్డుల ఏర్పాటు
2027లోపు పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం

దశాబ్దాల కల సాకారం

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం

- ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల సాకారం.. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం
- విజయవాడ, గుంటూరు, గుంతకల్, విశాఖపట్నం డివిజన్లతో 18వ రైల్వే జోన్‌గా ఏర్పాటు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో ఘనంగా సంబరాలు
- 1980ల నుంచి సాగిన ఉద్యమం ఫలించిందని, ఇది చరిత్రాత్మక మైలురాయి అని నేతల హర్షం
- ఈ జోన్‌తో ప్రాంతీయ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంచనా

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల చిరకాల స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దేశ 18వ రైల్వే జోన్ 'దక్షిణ కోస్తా రైల్వే' (రాజశీ=) సోమవారం అధికారికంగా తన కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రత్యేక రైల్వే పరిపాలన, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు నెరవేరాయి. ఈ చరిత్రాత్మక పరిణామంతో ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక కొత్త శకానికి నాంది పలికినట్లయింది.

హైదరాబాద్ సభకు బ్రేక్

హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ

జూన్ 2న ఆవిర్భావ వేడుకల దృష్ట్యా భద్రతా కారణాలు చూపిన పోలీసులు

'జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో సభకు ప్రణాళిక

ఈ సభపై తెలంగాణలో కొనసాగుతున్న రాజకీయ చర్చ

తెలంగాణ, ఉష శ్రీ : హైదరాబాద్‌లో జనసేన పార్టీ రేపు నిర్వహించ తలపెట్టిన నవనిర్మాణ సభకు సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో 'జనసేన సాధక్' (యాక్టివ్ సభ్యులు) సమావేశం నిర్వహించాలనుకున్నారు. సుమారు 2,000 మంది పార్టీ కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేసిన ఈ సమావేశానికి అనుమతిని తిరస్కరిస్తున్నట్లు సెరిలింగంపల్లి

తెలంగాణతో ఏం పని?

- పవన్ కల్యాణ్‌కు తెలంగాణతో ఏం పని?: అనిరుధ్ రెడ్డి
- తెలంగాణపై ప్రతికూల వ్యాఖ్యలు సహించమన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే
- ఏపీలో తెలంగాణ ఉద్యోగులు వేధింపులు ఎదుర్కొంటున్నారన్న ఆరోపణ...
- తెలంగాణ అంశాలపై బీఆర్ఎస్ మౌనం ఎందుకని ప్రశ్నించారు

తెలంగాణ, ఉష శ్రీ

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన... అసలు పవన్ కల్యాణ్‌కు తెలంగాణతో ఏం పని? అంటూ సూటిగా ప్రశ్నించారు. ఇటీవల పవన్ కల్యాణ్ తెలంగాణను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, రాజకీయ కార్యకలాపాలను కాంగ్రెస్ నేత తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా రాజకీయ పార్టీలు పెట్టుకునే, నడుపుకునే హక్కు ఉంటుందని అంగీకరిస్తూనే... పక్క రాష్ట్రాల నాయకులు

ఎయిర్‌ట్రంక్‌కు ఆహ్వానం

ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో మంత్రి నారా లోకేష్ భేటీ

విశాఖలో ఫ్యూచర్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని ఆహ్వానం

విశాఖను డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వెల్లడి

ఇప్పటికే భారత్‌లోకి ప్రవేశించిన ఎయిర్‌ట్రంక్ సంస్థ

ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సీఈఓ హామీ

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రఖ్యాత సంస్థ ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో ముంబయిలో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. విశాఖపట్నంలో 'ఎయిర్‌ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్'ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "విశాఖపట్నం వేగంగా ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా ఆవిర్భవిస్తోంది. ఇప్పటికే గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీకనెక్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అన్ని విధాలా అనుకూలమైన నగరం. ఇక్కడ 6 గిగావాట్ల డేటా సెంటర్లను నెలకొల్పాలన్నది మా లక్ష్యం. మల్టీ-గిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై మేం ప్రత్యేక దృష్టి సారించాం" అని వివరించారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతంలో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు ఏపీలో అందుబాటులో ఉన్నాయని, డేటా సెంటర్లకు అవసరమైన నిరంతర విద్యుత్ కోసం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు కూడా సిద్ధంగా ఉన్నాయని లోకేష్ తెలిపారు. ఎయిర్‌ట్రంక్‌ను ఏపీకి తీసుకురావాలన్న ప్రయత్నాలు గత కొంతకాలంగా జరుగుతున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా తొలిసారి రాబిన్ ఖుదాతో

ఐదుగురు కొత్త న్యాయమూర్తులు

- నలుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఒక సీనియర్ న్యాయవాదికి పదోన్నతి...
- సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం...
- 'ఎక్స్' వేదికగా నియామకాలను ప్రకటించిన కేంద్ర న్యాయశాఖ మంత్రి
- పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఇటీవల పెంచిన జడ్జీల సంఖ్య

జాతీయం, ఉష శ్రీ

సర్వోన్నత న్యాయస్థానానికి ఐదుగురు కొత్త న్యాయమూర్తులు నియమితులయ్యారు. నలుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలంటూ కొలీజియం చేసిన సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదముద్ర వేసింది. ఈ నియామకాలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపినట్లు కేంద్ర

ఐదుగురు కొత్త న్యాయమూర్తులు

న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(2) ప్రకారం ఈ నియామకాలు జరిగాయని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మే 22, 27 తేదీల్లో జరిగిన సమావేశాల్లో సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఐదుగురి పేర్లను పదోన్నతి కోసం కేంద్రానికి సిఫార్సు చేసింది. కొత్తగా నియమితులైన వారిలో పంజాబ్, హరియాణా హైకోర్టు చీఫ్ జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా, జమ్మూకశ్మీర్, లడఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. వీరితో పాటు సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ వి. మోహనను కూడా నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించే లక్ష్యంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కాకుండా న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచుతూ రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో తాజా నియామకాలకు ప్రాధాన్యత ఏర్పడింది. కొత్తగా నియమితులైన న్యాయమూర్తులు వివిధ హైకోర్టులలో విశేష అనుభవం ఉంది. జస్టిస్ నాగు 2011 నుంచి జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ సచ్‌దేవా, జస్టిస్ పల్లి 2013 నుంచి న్యాయమూర్తులుగా సేవలందిస్తున్నారు. సీనియర్ అడ్వకేట్ మోహన సుప్రీంకోర్టులో రాజ్యాంగ, సివిల్, సర్వీస్ సంబంధిత కేసుల వాదనలో నిపుణురాలిగా పేరుగాంచారు. ఈ నియామకాలతో సుప్రీంకోర్టులో కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయి.

దశాబ్దాల కల సాకారం

కొత్త జోన్ స్వరూపం ఇదీ.. దక్షిణ మధ్య రైల్వే (రాజ=) మరియు ఈస్ట్ కోస్ట్ రైల్వే (జుజశీ=) జోన్లలోని కొన్ని భాగాలను పునర్వ్యవస్థీకరించి ఈ కొత్త జోన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఉన్నాయి. మొత్తం 385 రైల్వే స్టేషన్లతో విస్తరించి ఉన్న ఈ జోన్‌లో 62,000 మంది సిబ్బంది పనిచేయనున్నారు. వార్షికంగా సుమారు రూ.15,500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. సాధారణ రోజుల్లో 500 ప్యాసింజర్ రైళ్లు, 800 గూడ్స్ రైళ్లను నడపనుంది. విశాఖపట్నం, గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ, త్వరలో రానున్న మూలపేట పోర్టులను అనుసంధానించడం ద్వారా ఈ జోన్ సరుకు రవాణా, మల్టీమోడల్ లాజిస్టిక్స్‌కు ఊతమివ్వనుంది.

సంబరాల్లో నేతలు, ప్రజలు: కొత్త రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడంతో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ప్రజలు, రాజకీయ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోమవారం శ్రీకాకుళం జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లను స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించి, ప్రజల ఆనందంలో పాలుపంచుకున్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులకు ఒక భావోద్వేగపూరితమైన, చిరకాల కల నెరవేరిన చారిత్రక ఘట్టం" అని తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఇచ్ఛాపురం సమీపంలో ఏర్పాటు చేసిన స్వాగత ఫలకాన్ని చూసినప్పుడు కలిగిన ఆనందం మాటల్లో చెప్పలేనిదని, ఈ మైలురాయికి గుర్తుగా మొక్కలు నాటినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఈ జోన్ ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రాన్ని మారుస్తుందని, కొత్త ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సుదీర్ఘ పోరాట చరిత్ర: విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ 1980ల నుంచే బలంగా వినిపిస్తోంది. ఈ పోరాటంలో తాను విద్యార్థి దశ నుంచే పాల్గొన్నానని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గుర్తుచేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, "దక్షిణ మధ్య రైల్వే ఏర్పడినప్పుడు తెలుగు మాట్లాడే ప్రాంతాలను చెన్నై కేంద్రంగా ఉన్న దక్షిణ రైల్వే నుంచి మార్చారు. కానీ, వ్యూహాత్మకంగా కీలకమైన వాల్తేరు డివిజన్‌ను కోల్‌కతా కేంద్రంగా ఉన్న సౌత్ ఈస్టర్న్ రైల్వే పరిధిలోనే ఉంచారు. ఆ తర్వాత 1997లో భువనేశ్వర్ కేంద్రంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే ఏర్పడినప్పుడు వాల్తేరు డివిజన్‌ను దాని కిందకు తెచ్చారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు నష్టం, నియామకాల్లో వివక్ష, ప్రయాణికుల సమస్యలపై నిర్లక్ష్యం వంటివి పెరిగాయి. దీంతో ప్రత్యేక జోన్ డిమాండ్ మరింత బలపడింది," అని వివరించారు. ఈ డిమాండ్ సాధన కోసం బీజేపీ, ఇతర పార్టీలతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ (జీఆజ) ఆధ్వర్యంలో ఎన్నోసార్లు రైల్వే మంత్రులకు వినతిపత్రాలు సమర్పించామని, 2010 మార్చి 20న విశాఖలో భారీ రైల్ రోకో నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో నాటి యూపీఏ ప్రభుత్వం విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ హామీ ఇచ్చింది. అయితే, 2019లో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొత్త జోన్ ఏర్పాటును ప్రకటించింది. 2024లో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జోన్ ఏర్పాటు పనులు వేగవంతమయ్యాయి. 2025 జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ రూ.149 కోట్లతో జోనల్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత ఏడాది జూన్‌లో సందీప్ మాథుర్‌ను కొత్త జోన్‌కు జనరల్ మేనేజర్‌గా నియమించారు. ఎట్టకేలకు దశాబ్దాల పోరాటం, ఎందరో నాయకులు, ప్రజాసంఘాల కృషి ఫలించి, ఉత్తరాంధ్ర చిరకాల వాంఛ నెరవేరింది. ఈ జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ఆర్థిక పరివర్తనకు, రాష్ట్ర అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు

హైదరాబాద్ సభకు బ్రేక్

జోన్ డీసీపీ కార్యాలయం సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. శాంతిభద్రతల సమస్యలు, స్థానిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇటీవల ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం, ఆ తర్వాత ఏపీకి చెందిన జనసేన సహా కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని పోలీసులు తెలిపారు. ఈ పరిణామాల వల్ల తెలంగాణలోని విద్యార్థి సంఘాలు, ఇతర బృందాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని వివరించారు. అంతేకాకుండా, జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఈ సమయంలో సమావేశం నిర్వహించడం సమంజసం కాదని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని, నిరసనలు, ఆందోళనలు జరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో పాటు, సమావేశం జరగాల్సిన సంధ్యా కన్వెన్షన్‌కు తగినంత పార్కింగ్ సౌకర్యం లేదని విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. నిర్వాహకులు పార్కింగ్ కోసం ప్రతిపాదించిన ఎఫ్‌సీఐ సొసైటీ లేఅవుట్‌కు సంబంధించిన స్థలంపై న్యాయపరమైన వివాదాలు ఉన్నాయని, ఆ స్థలంపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తమ ఉత్తర్వుల్లో వివరించారు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రజా శాంతికి భంగం కలగకూడదనే ఉద్దేశంతో సమావేశానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ తాళ్లూరి రామ్ ఈ సమావేశం కోసం మే 29న పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు.

ఎయిర్‌ట్రంక్‌కు ఆహ్వానం

సమావేశమై ఏపీ దార్శనికతను వివరించారు. ఆ తర్వాత ఎయిర్‌ట్రంక్ బృందం, ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చలు జరిపింది. అయితే, భారత్‌లో కార్యకలాపాలకు ఒక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసుకున్న తర్వాతే విస్తరణపై నిర్ణయం తీసుకుంటామని అప్పట్లో ఎయిర్‌ట్రంక్ తెలిపింది. ఈ నేపథ్యంలో, ఎయిర్‌ట్రంక్ ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికారికంగా భారతదేశంలోకి ప్రవేశించింది. బ్లాక్‌స్టోన్ మద్దతు ఉన్న డేటా సెంటర్ ప్లాట్‌ఫాం 'లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా'ను టేకోవర్ చేసింది. ఈ స్వాధీనంతో ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలో సుమారు 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులు ఆ సంస్థ చేతికి వచ్చాయి. ఇది ఎయిర్‌ట్రంక్‌కు భారత్‌లో తక్షణ కార్యకలాపాలకు మార్గం సుగమం చేసింది. తమ ఆసియా పసిఫిక్ వ్యూహంలో భారత్‌ను ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా ఆ సంస్థ గుర్తించింది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో, లోకేష్ మరోసారి రాబిన్ ఖుదాతో భేటీ అయి, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. దీనిపై రాబిన్ ఖుదా స్పందిస్తూ... ఎయిర్‌ట్రంక్ భారత ప్రణాళికలు, లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా ఏకీకరణ, భవిష్యత్ విస్తరణ రోడ్‌మ్యాప్ వంటి అంశాలను చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ భేటీతో విశాఖలో మరో భారీ పెట్టుబడికి మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

కందకాలు తవ్వారు

నిదర్శనం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే పేదల కోసం పనిచేస్తోందని, దానికి పెంచిన పింఛన్లే నిదర్శనమని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి తొలి నెల నుంచే పింఛన్లను పెంచి అందిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4,000 చేశామని, దివ్యాంగులకు రూ.6,000కు పెంచామని గుర్తు చేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఆరోగ్య పింఛన్లను రూ.10,000, రూ.15,000కు పెంచామని వివరించారు. 2024 జూలై నుంచి ఇప్పటివరకు పింఛన్ల రూపంలో రూ.65,887 కోట్లు అందించామని, ఏడాదికి ఈ ఒక్క పథకం కోసమే దాదాపు రూ.32 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల రాష్ట్రవ్యాప్తంగా 62.34 లక్షల మందికి రూ.2,729 కోట్లు పంపిణీ చేస్తున్నామని, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదని అన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధి: పేదరికం లేని సమాజాన్ని చూడాలన్నదే తన కల అని చంద్రబాబు అన్నారు. కేవలం పింఛన్లే కాకుండా 'తల్లికి వందనం', 'స్త్రీశక్తి', 'అన్నదాత సుఖీభవ' వంటి అనేక పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గడిచిన 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, తద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వంటివి యువతకు ఉపాధి మార్గాలు చూపుతాయని అన్నారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు: పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పాఠశాలల్లో పాఠ్యాంశాలు మారుస్తున్నామని, నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఖరీదైన వైద్యం కోసం ప్రజలు అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తీసుకువస్తున్నామని ప్రకటించారు. 'సంజీవని' పేరుతో ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని తెలిపారు. డాక్టర్ అపాయింట్‌మెంట్లు, ఆరోగ్య సందేహాల నివృత్తి కోసం 'ఏఐ డాక్టర్' సేవలను కూడా అందుబాటులోకి తెస్తామని వివరించారు. రాష్ట్రాన్ని 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

ప్రాంతీయ అభివృద్ధి.. పోలవరం పూర్తి: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి వరకు విశాఖ రీజియన్‌గా, పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకు అమరావతి రీజియన్‌గా, తిరుపతి కేంద్రంగా రాయలసీమ రీజియన్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2027లో గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని, ఆ లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులను జూలై నాటికి పూర్తి చేసి నీరందిస్తామని చెప్పారు. మత్స్యకారుల కోసం రూ.240 కోట్లతో 200 మెకనైజ్డ్ బోట్లను సబ్సిడీపై అందిస్తామని, అమినాబాద్ ఫిషింగ్ హార్బర్ కోసం రూ.80 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.

సుపరిపాలనే ధ్యేయం.. కలిసికట్టుగా ముందుకి: ప్రజలకు నాణ్యమైన పౌరసేవలు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. '2047 స్వర్ణాంధ్ర విజన్'తో రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. ఈ యజ్ఞంలో మిత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కాకినాడ జిల్లాలో పౌరసేవలు సంతృప్తికరంగా అందించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

తెలంగాణతో ఏం పని?

వచ్చి తెలంగాణపై ద్వేషాన్ని, ప్రతికూలతను వ్యాప్తి చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య ఇంకా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల విభజన అంశాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రధానంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా పనిచేస్తున్న తెలంగాణ ప్రాంత ఉద్యోగులు తీవ్ర వివక్షకు, వేధింపులకు గురవుతున్నారని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. అదే సమయంలో తెలంగాణలో ఉన్న ఆంధ్ర ఉద్యోగులు మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నత స్థానాల్లో సౌకర్యవంతంగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. విభజన సమస్యల వల్ల ఏపీలో చిక్కుకుపోయిన తెలంగాణ ఉద్యోగులందరినీ తక్షణమే వెనక్కి రప్పించేలా తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్

నాయకులు నిరంతరం తెలంగాణను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నా, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎందుకు మౌనంగా ఉంటుందో సమాధానం చెప్పాలని అనిరుధ్ రెడ్డి నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో వారు నోరు మెదపడం లేదని విమర్శించారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన సానా సతీష్ బాబు

కాకినాడ, జూన్ 1(ఉషశ్రీ): ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు రాజ్యసభ సభ్యుడు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు సానా సతీష్ బాబు సోమవారం పెన్షన్లు పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని రమణయ్యపేటలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్లు అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం సామాజిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదు

- పిజిఆర్ఎస్ లో 111 అర్జీలు స్వీకరణ..
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్.

రంపచోడవరం, జూన్ 01(ఉష శ్రీ ప్రతినిధి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సకాలంలో పరిష్కరించడం అధికారుల బాధ్యత అని,ఎట్టి పరిస్థితుల్లో ప్రతి అర్జీ ఎస్ ఎల్ ఎ కాలపరిమితి లోగా వీక్షించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ స్పష్టం చేశారు.ఆన్‌లైన్‌లో నమోదు అయ్యే అర్జీలను ప్రతిరోజూ పరిశీలించాలని,వాటిని నిర్లక్ష్యం చేయడం అధికారులు విధుల్లో చూపే అలసత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.సోమవారం రంపచోడవరం లోని ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్,జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేశ్ కుమార్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీలు సంబంధిత అధికారుల లాగిన్‌లో అందుబాటులో ఉంటాయని, వాటిని సమర్థవంతంగా పరిష్కరించే బాధ్యత ఆయా శాఖల అధికారులదేనని తెలిపారు.రీ-ఓపెన్ అర్జీలపై నిర్వహించిన ఆడిట్ ద్వారా కొంత పురోగతి కనిపించిందని, అయినప్పటికీ ఇంకా కొన్ని అర్జీలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పటివరకు 6,359 పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించగా, వాటిలో 2,484 అర్జీలను (39.06 శాతం) ఆడిట్ చేసినట్లు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమగ్ర వివరాలతో హాజరై, పెండింగ్ అర్జీల స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలవరం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తిగత, సామూహిక సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని, మిగిలిన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వారపు గ్రీవెన్స్ మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో మొత్తం 111 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ కె దినేష్ కుమార్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్,ఏపీఓ జనరల్ డీఎన్‌వీ రమణ,గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఎంహెచ్‌ఓ పి. సరిత,సీపీఓ వెంకట్రావు,డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ దాసరి రత్నాకరరావు,జిల్లా విద్యాశాఖ అధికారి వై.మల్లేశ్వరరావు,జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ విమానాశ్రయాన్ని కొనసాగించాలి

సీఎం, కేంద్ర మంత్రిలకు ఆచార్య కే.ఎస్. చలం లేఖ

విశాఖపట్నం, (ఉషశ్రీ)జూన్ 1: విశాఖపట్నంలోని ప్రస్తుత విమానాశ్రయాన్ని కొనసాగించాలని, దానిని మూసివేయాలనే ఆలోచనను పునరాలోచించాలని యూపీఎస్సీ మాజీ సభ్యుడు ఆచార్య కే.ఎస్. చలం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి లేఖ రాశారు. విశాఖ విమానాశ్రయాన్ని భోగాపురం విమానాశ్రయానికి పూర్తిగా ప్రత్యామ్నాయంగా మార్చడం వల్ల విశాఖపట్నం అంతర్జాతీయ విమానయాన పటంలో ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పురాతన విమానాశ్రయాల్లో ఒకటైన విశాఖ విమానాశ్రయం పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి ఎయిర్‌స్ట్రిప్ ఆధారంగా ఏర్పడిన ఈ విమానాశ్రయాన్ని కేంద్ర ప్రభుత్వం భారీ వ్యయంతో ఆధునీకరించిందని గుర్తు చేశారు. విశాఖలో నిర్వహించిన అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు ఈ విమానాశ్రయం ప్రధాన వేదికగా నిలిచిందన్నారు. భోగాపురానికి విమానాశ్రయ కార్యకలాపాలను పూర్తిగా తరలిస్తే ప్రయాణికులు, పెట్టుబడిదారులు, పర్యాటకులు నగరానికి చేరుకోవడానికి అదనంగా సుదీర్ఘ దూరం ప్రయాణించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇది ఉత్తరాంధ్ర ప్రజలకే కాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు.

జూన్ 5 నుంచి పునఃప్రారంభం కానున్న కృష్ణవేణి నదీ నవహారతులు

ఇంద్రకీలాద్రి, (ఉషశ్రీ)జూన్ 1: సనాతన హిందూ ధర్మ ప్రచారం, టెంపుల్ టూరిజం అభివృద్ధిలో భాగంగా ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం (ఫెర్రీ ఘాట్) వద్ద నిర్వహించే కృష్ణవేణి నదీ నవహారతులు కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీ నుంచి పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ సోమవారం సాయంత్రం పవిత్ర సంగమం వద్ద క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు, వైదిక కమిటీ సభ్యులు, దేవస్థానం అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సహాయ కమిషనర్‌లతో కలిసి నవహారతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడంతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఇంటి వద్ద ఇవ్వాల్సిన పింఛన్లు రోడ్డుపై పంపిణీ?

వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

విజయవాడ, జూన్ 1 (ఉషశ్రీ): రాష్ట్రంలోని ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, ధ్రువపత్రాల జారీ, పింఛన్ల పంపిణీ వంటి సేవలను ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్లే విధానాన్ని అమలు చేసింది. సచివాలయ సిబ్బంది, అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండటంతో పాటు లబ్ధిదారుల వద్దకే వెళ్లి సేవలు అందించేవారు. దీంతో ఆ సమయంలో ప్రజల నుంచి, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల నుంచి విశేష ప్రశంసలు లభించాయి. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయాల్లో పనిచేసే సిబ్బందిలో కొంతమందిని ఇతర శాఖలకు బదిలీ చేయడం, మరికొందరికి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల ప్రజలకు సేవలు సకాలంలో అందడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఇంటి వద్దకే అందించాల్సిన పింఛన్ల విషయంలో పలు ప్రాంతాల్లో నిర్లక్ష్యం కనిపిస్తోందని లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్ పంపిణీ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి నగదు అందించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని రోడ్లపైకి లేదా గ్రామంలోని నిర్దిష్ట ప్రదేశాలకు పిలిపించి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో సిబ్బంది తాము సూచించిన కేంద్రాలకు రావాలని లబ్ధిదారులకు సమాచారం ఇచ్చి, అక్కడే పింఛన్లు అందజేసు ్తన్నట్లు తెలుస్తోంది. దీంతో నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్న వృద్ధులు, దివ్యాం గులు మండుటెండల్లో బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, ఇంటి వద్ద సేవలు అందాల్సిన పరిస్థితిలో ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోవడం బాధాకరమని చెబుతున్నారు. ప్రజలకు మరింత చేరువగా సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఇంటి వద్ద పింఛన్ పంపిణీ విధానం క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కాకపోవడం ఆందోళన కలిగిస్తోందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా స్పందన లేకపోవడం, ఫిర్యాదులపై చర్యలు కనిపించకపోవడం పట్ల లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల విషయంలో నిబంధనల ప్రకారం ఇవ్వలేకపోయినా మానవతా దృక్పథంతోనైనా వ్యవహరించి వారికి ఇంటి వద్దనే పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పింఛన్ పంపిణీ ప్రక్రియపై ఉన్నతాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, ఫిర్యాదులపై తక్షణ స్పందన అందించే వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల అసలు ప్రయోజనం చివరి లబ్ధిదారుడి వరకు చేరాలంటే క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతమైన అమలు, అధికారుల సమయోచిత స్పందన, నిరంతర పర్యవేక్షణ అత్యంత అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో నీటి ఎద్దడిని నివారించాలి

- వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకోవాలి
- నీరు కలుషితం కాకుండా చూడాలి
- వెంట వెంటనే మోటార్లు రిపేర్లు చేయించాలి
- తాగునీటి సమస్యలపై పత్రికల్లో వస్తున్న కథనాలకు వెంటనే స్పందించాలి
- మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరా పెంచాలన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం ఉష శ్రీ జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి జూన్1:- పార్వతీపురం మన్యం జిల్లాలో నీటి ఎద్దడిని నివారించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, ఓబీసీ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, పార్వతీపురం మండల అధ్యక్షులు బంకురు ప్రకాష్, యువజన నాయకులు గొర్లి ధనంజయ, పట్టణ మహిళా అధ్యక్షురాలు బసవ వసుంధర తదితరులు పార్వతీపురం లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా జిల్లాలో వేసవి ఎండలు మండుతున్న నేపద్యంలో పలు ప్రాంతాలలో ప్రజలు తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా ప్రజల తాగునీటి కష్టాలు వార్తాపత్రికలు సైతం ఘోషిస్తున్నాయన్నారు. తక్షణమే జిల్లా యంత్రాంగం జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిలో భాగంగా పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీలలో ఇప్పుడు సరఫరా చేస్తున్న ఎం.ఎల్డీల నీటి పరిమాణాన్ని పెంచాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రజలకు రోజువారి ఇవ్వాల్సిన నీటిని సరఫరా చేయాలన్నారు. పార్వతీపురం ప్రజలకు 8.50 ఎంఎల్డి, సాలూరు ప్రజలకు 7 ఎం ఎల్ డి, పాలకొండ ప్రజలకు 4 ఎమ్మెల్డీ నీటిని సరఫరా చేయాలన్నారు. వేసవి ఎండల కారణంగా నీటి వినియోగం కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. దానికి తగ్గట్టుగా ప్రజలకు తాగునీటిని ఇవ్వాలన్నారు. అలాగే పార్వతీపురం మండలంలోని పలు గ్రామాలకు తాగు నీటిని అందించే డి.శీర్లం పైలెట్ ప్రాజెక్టుపై అప్రమత్తత అవసరం అన్నారు. నిర్వహణ సక్రమంగా లేక నిత్యం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. సీతానగరం మండలం కోట సీతారాంపురం గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీలకు నీటి సరఫరా చేయాలన్నారు. నిత్యం కాబినేటికి ఇబ్బందులు పడుతున్న అక్కడ ప్రజలకు తాగునీటి సరఫరా చేసేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. పార్వతీపురం మండలం పుట్టూరులో తాగునీటి ఇబ్బందులకు కారణమైన మోటర్లు వెంటనే బాగు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. పాచిపెంట మండలంలో తుమ్మరపల్లి, చిమిడివలస, మిలియా కంచూరు, కాకులు మామిడి తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు స్వచ్ఛమైన తాబినేటిని అందివ్వాలి అన్నారు. కిలోమీటర్ల కొద్దీ వెళ్లి ఊట గెడ్డలు, చలమల్లో నీటిని తాగుతున్న ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కాబట్టి దీనిపై జిల్లా అధికారులు అప్రమత్తం కావాలన్నారు.పాలకొండ మండలం బాసురు రక్షిత మంచినీటి పథకం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మల్లివీడు, అట్టలి, లుంబూరు ప్రాంతాల ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలో రోజు కులాయి నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్వతీపురం లోని బైపాస్ కాలనీ గూడ్స్ హెడ్ రోడ్డు రాజీవ్ కాలనీ జనశక్తి కాలనీ విజయరామరాజు కాలనీ తదితర ప్రాంతాలతో 30 మురికివాడలకు తాగునీటి సరఫరా పుష్కలంగా చేయాలన్నారు. సాలూరు మున్సిపాలిటీలో బంగారమ్మపేట, రైల్వే నగర్, శ్రీనివాస్ కాలనీ, గాయత్రి నగర్, గారమ్మ కాలనీ, ఆంజనేయ నగర్, శ్రీనివాస్ నగర్ తదితర ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పుష్కలంగా తాగు నీటిని సరఫరా చేయాలన్నారు. పాచిపెంట మండలం తంగలం పంచాయతీలో సిమిడివలస, కొండంగిపాడు, చాకిరేవువలస, కుంభీ వలస తదితర ప్రాంతాలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. కురుపాం మండలంలో ఏగులవాడ పంచాయతీ సంధిగూడ, ఆగంగూడ, బొడ్డుగాడిగూడ, జరడ పంచాయతీలో కొత్తగూడా, ఈతమానుగూడ తదితర ప్రాంతాల ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో మంత్రజోల, ఓడ్రుబంగి, దేరుగండ , వనకాబడి ప్రాంతాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. సీతంపేట మండలంలో ఎగువదారభ, గోలుకొప్పగూడ, ఎగువద్వార బంధం గ్రామాలతో పాటు జిఎం వలస మండలంలో వనజ గ్రామంలో మరమ్మతులకు గురైన మోటారు బాగు చేయించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తీవ్రమైన ఎండలతో వేసవిని దృష్టిలో పెట్టుకొని జిల్లా యంత్రాంగం జిల్లాలో ప్రజలకు తాగినీటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

లబ్ధిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు... ఇంటింటికి తిరిగి పంపిన చేసిన యూనిట్ ఇంచార్జ్ భాషా

ఉష శ్రీ పామూరు ప్రతినిధిరజియా సయ్యద్ పామూరు పట్టణంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతినెల ఒకటో తేదీనే ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న' ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం యూనిట్ ఇంచార్జ్ గౌస్ బాషా స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో సరికొత్త పారిశ్రామిక విప్లవానికి నాంది

- ఒకే గొడుగు కింద అన్ని అనుమతులు.. ఉపాధి పథకాలు
- పరిశ్రమల స్థాపనకు 'సింగిల్ విండో' సేవలు

జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి పార్వతీపురం, ఉష శ్రీ ప్రతినిధి జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి జూన్ 01 : కలెక్టరేట్ ఆవరణలో సరికొత్తగా ఏర్పాటు చేసిన 'వన్ ఫ్యామిలీ – ఒన్ ఇంట్రెప్రెనేర్' (ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త) కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగనాథ్, జిల్లా రెవిన్యూ. అధికారి కె. హేమలత వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. జిల్లాలోని ప్రతి కుటుంబం నుండి ఒక్కరు విజయవంతమైన పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా, జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఈ వినూత్న కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా వ్యాపారాలు లేదా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలనుకునే నిరుద్యోగులు, ఔత్సాహికులు వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ఈ కేంద్రం ఒకే వేదికగా పనిచేస్తుందన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్ శాఖ, ఫ్యాక్టరీల ఇన్స్పెక్టర్, అగ్నిమాపక శాఖలతో పాటు జీఎస్టీ, రవాణా, వ్యవసాయ, ఉద్యానవన, ఐటీడీఏ, డీఆర్‌డీఏ వంటి అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవసరమైన పూర్తి సహాయ సహకారాలు, అనుమతులు ఇక్కడ లభిస్తాయన్నారు. రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి వర్యులు నిర్దేశించిన 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల సాధన దిశగా ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. ఈ అద్భుత లక్ష్య సాధన కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (ణ=ణూా), మెప్మా (వీజ్రూహీూ), పరిశ్రమల శాఖ, నైపుణ్యాభివృద్ధి సంస్థలతో పాటు ఇతర అనుబంధ శాఖల మధ్య సమన్వయం (జశీఅజవతీస్త్రవఅఎవ) సాధించేందుకు ఈ కేంద్రం ఒక సమర్థవంతమైన వేదికగా పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల సంయుక్త భాగస్వామ్యంతో ఔత్సాహికులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఔత్సాహికులకు లభించే ప్రధాన సేవలు ఈ కేంద్రానికి వచ్చే వారికి జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రతినిధులు ముఖ్యమైన విభాగాల్లో అండగా నిలుస్తారు: ?భారీ సబ్సిడీలతో ప్రభుత్వ పథకాలు ఈ కేంద్రం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమైన పారిశ్రామిక విధానాలు, రాయితీలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు: ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ఈ పథకం కింద రూ. 20 లక్షల నుండి రూ. 50 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. ఇందులో పట్టణ ప్రాంతాల వారికి 25%, గ్రామీణ ప్రాంతాల వారికి 35% భారీ సబ్సిడీ లభిస్తుంది. ఆహార శుద్ధి పరిశ్రమల పథకం:లిచిన్న తరహా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు గరిష్టంగా రూ. 10 లక్షల వరకు 35% సబ్సిడీతో పాటు సాంకేతిక సహాయం అందిస్తారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి విధానం పరిశ్రమలకు విద్యుత్ రాయితీ, పెట్టుబడి రాయితీలతో పాటు ఎస్సీ, ఎస్టీ (రాజ/రా) వర్గాల ఔత్సాహికులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తారు. ?జిల్లాలో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి, స్వయం ఉపాధి వైపు అడుగులు వేసే వారికి ఈ 'వన్ ఫ్యామిలీ – ఒన్ ఇంట్రెప్రెనేర్' కేంద్రం ఒక గొప్ప వరమని, జిల్లా ప్రజలు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

రాజ్యసభ, శాసన మండలి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

న్యూఢిల్లీ, (ఉషశ్రీ)జూన్ 1: దేశవ్యాప్తంగా రాజ్యసభ (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్) మరియు రాష్ట్ర శాసన మండలి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైనట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 10 రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న 24 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించనుండగా, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాలు ఈ ఎన్నికల పరిధిలో ఉన్నాయి. అలాగే, బీహార్‌లో 9 శాసన మండలి స్థానాలకు, కర్ణాటకలో 7 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించనుండగా, బీహార్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. నామినేషన్ల దాఖలుకు జూన్ 8 సాయంత్రం 3 గంటల వరకు గడువు ఉండగా, జూన్ 9న పరిశీలన (స్క్రూటినీ) నిర్వహిస్తారు. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు జూన్ 11 చివరి తేదీగా నిర్ణయించారు. పోటీ నెలకొంటే జూన్ 18న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపడతారు.

ముఖ్యాంశాలు

రాజ్యసభ 27 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
24 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు, 3 స్థానాలకు ఉప ఎన్నికలు
ఆంధ్రప్రదేశ్ సహా 10 రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు
జూన్ 8 వరకు నామినేషన్ల స్వీకరణ
జూన్ 18న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు

విజయవాడలో పాల అమ్మక కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- పాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించిన అధికారులు
- కల్తీ పాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- అనుమానాస్పద విక్రయాలపై ప్రజలు ఫిర్యాదు చేయాలని సూచన



విజయవాడ, (ఉషశ్రీ) జూన్ 1: నగరంలోని పలు పాల అమ్మక కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలు, ఫుడ్ సేఫ్టీ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి .శ్రీనివాస్ ఉదయం 7 గంటల నుంచి వివిధ ప్రాంతాల్లో పరిశీలనలు చేపట్టి పాల నమూనాలను సేకరించారు. తనిఖీల సందర్భంగా అధికారులు పాల నాణ్యత, విక్రయ విధానాలను పరిశీలించి, సేకరించిన నమూనాలను ప్రయోగశాల పరీక్షల కోసం పంపించారు. ఇప్పటివరకు ఆరు పాల నమూనాలు సేకరించినట్లు వెల్లడించారు. ప్రజలు కల్తీ పాలు విక్రయిస్తున్నట్లు అనుమానం కలిగితే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు, సమీప పోలీస్ స్టేషన్‌కు, వీఆర్వో లేదా ఎంఆర్వోలకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అలాగే పాల విక్రేతలు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. లాబొరేటరీ పరీక్షల్లో హెవీ మెటల్స్, టాక్సిన్స్ లేదా ఆరోగ్యానికి హానికరమైన ఇతర పదార్థాలు ఉన్నట్లు తేలితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.

గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పడిన జీసీసీకి విశిష్ట చరిత్ర ఉంది ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు

సేవా సంస్థను వాణిజ్య సంస్థగా మార్చే ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయి

చింతపల్లి, జూన్ 1, ఉష శ్రీ : ప్రజా సంక్షేమ బావుటా న్యూస్ గిరిజనుల అవసరాలను తీర్చడం, వారికి నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచడం, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, దళారుల దోపిడీ నుంచి రక్షించడం వంటి మహోన్నత లక్ష్యాలతో 1954-56 కాలంలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఏర్పాటు చేయబడిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పేర్కొన్నారు. గిరిజనుల అభ్యున్నతిని కేంద్రబిందువుగా చేసుకుని ఏర్పడిన జీసీసీ నేడు ఒక చారిత్రక సంస్థగా నిలిచిందని ఆయన అన్నారు. చింతపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆనాటి రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో రవాణా, సమాచార, మార్కెటింగ్ సౌకర్యాలు చాలా పరిమితంగా ఉండేవని గుర్తు చేశారు. గిరిజన కుటుంబాలు ఉప్పు, పప్పులు, కిరోసిన్, బెల్లం వంటి నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేందుకు కొండలు, వాగులు దాటి అనేక కిలోమీటర్లు నడిచి జీసీసీ డిపోలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. గిరిజనులగ కష్టాలను గుర్తించిన జీసీసీ ని బలోపేతం చేసి గ్రామాలకు చేరువగా సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. గిరిజనులు అడవుల నుంచి సేకరించే ్రా అటవీ ఉత్పత్తులను దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధిక లాభాలు పొందుతున్న పరిస్థితిని అరికట్టేందుకు జీసీసీ కీలక పాత్ర పోషించిందన్నారు . గిరిజనులకు గిట్టుబాటు ధరలు అందించడం ద్వారా వేలాది కుటుంబాల జీవనోపాధిని కాపాడిందని తెలిపారు. తన హయాంలో జీసీసీకి ఒక సమగ్ర రూప ్రరేఖలు తీసుకువచ్చామని బాలరాజు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో కొత్త డిపోలను ఏర్పాటు చేసి సేవలను విస్తరించామని తెలిపారు. ముఖ్యంగా జీసీసీలో ఉద్యోగాల విషయంలో గిరిజనులకు ప్రాధాన్యత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. మేనేజర్ స్థాయి నుంచి జూనియర్ మేనేజర్ స్థాయి వరకు సాధ్యమైనంత మేర గిరిజన యువతకు అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేశామన్నారు. అదే సమయంలో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 20 మేనేజర్ పోస్టులు, 20 జూనియర్ మేనేజర్ పోస్టులు, దాదాపు 290 మంది సేల్స్‌మెన్ పోస్టులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నియామకాల ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు జీసీసీ సేవలను గ్రామీణ ప్రాంతాలకు మరింత విస్తరించగలిగామని పేర్కొన్నారు. చింతపల్లిలో జీసీసీ డివిజనల్ మేనేజర్ (డీఎం) కార్యాలయం, జీకే వీధిలో బ్రాంచ్ కార్యాలయం ఏర్పాటు చేయడం తమ హయాంలోనే జరిగిందని ఆయన గుర్తు చేశారు. అలాగే సుదూర గిరిజన గ్రామాలకు సేవలు చేరేలా డిపోలను విస్తరించడం ద్వారా ప్రజలకు సేవలు మరింత చేరువయ్యాయని వివరించారు. ఆనాడు సేవా లక్ష్యంతో జీసీసీలో చేరిన ఉద్యోగులు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ గిరిజన ప్రాంతాల్లో పనిచేశారని బాలరాజు కొనియాడారు. రహదారులు లేని రోజుల్లో కాలినడకన గ్రామాలకు వెళ్లి సరుకుల పంపిణీ, అటవీ ఉత్పత్తుల కొనుగోలు, గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. వారిలో చాలామంది ప్రస్తుతం సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ పొందుతున్నారని, వారి సేవలు గిరిజన సమాజ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఇటీవలి పరిణామాలపై స్పందించిన ఆయన, "సంస్థ ఏర్పాటుకు పుట్టని వ్యక్తులు తామే సంస్థను అభివృద్ధి చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదం. అన్నారు అలాగే గిరిజనుల సేవ కోసం స్థాపించబడిన జీసీసీ క్రమంగా సేవా దృక్పథం నుంచి వాణిజ్య దృక్పథం వైపు మళుతున్నట్లు కనిపించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. జీసీసీ లక్ష్యం లాభాల ఆర్జన కాకుండా గిరిజన సంక్షేమమని, సంస్థ స్థాపన వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని మరువరాదని సూచించారు. గిరిజన రైతులు, అటవీ ఉత్పత్తుల సేకరణదారులు, నిరుపేద కుటుంబాలకు జీసీసీ ఎల్లప్పుడూ అండగా నిలవాలని అభిప్రాయపడ్డారు. "గిరిజనబీప్రాంత అభివృద్ధి కోసం తాము ఎల్లప్పుడూ పదవులతో పనిలేకుండా ఎల్లప్పుడూ సిద్ధం గానే ఉంటామన్నారు. . జీసీసీ అసలు లక్ష్యం గిరిజన సంక్షేమం, గిరిజన సేవ. ఆ లక్ష్యం ఎప్పటికీ కొనసాగాలని పసుపులేటి బాలరాజు స్పష్టం చేసారు.

జిల్లాలో రూ.99 కోట్ల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

విజయవాడ, (ఉషశ్రీ)జూన్ 1: ఎన్టీఆర్ భరోసా పథకం కింద జిల్లాలో 2,25,887 మంది లబ్ధిదారులకు రూ.99.01 కోట్ల పెన్షన్లు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున విజయవాడ మారుతీనగర్‌లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్లు అందజేసిన కలెక్టర్, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి నెల ఒకటో తేదీన ఇంటి వద్దకే పెన్షన్లు అందజేస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, మత్స్యకారులు తదితర వర్గాలకు ఈ పథకం ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏ.ఎన్.వి. నాంచారరావు, వీఎంసీ జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంతవరకు మీకు సేవకుడిగానే ఉంటా.!

భీమునిపట్నం, ఉష శ్రీ: నా గొంతులో ప్రాణం ఉన్నంతవరకు మీకు సేవ చేసుకొనే శక్తిని ఇవ్వాలని దేవుని అనుక్షణం కోరుకుంటానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. సోమవారం గంటా నూకరాజు జన్మదినం సందర్భంగా భీమిలి పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసారు. 3వ వార్డు అధ్యక్షులు గొలగాని నరేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి కనకల అప్పలనాయుడు, భీమిలి గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ చురకల రమణ, రాష్ట్ర నాగవంశం డైరెక్టర్ గాడు సన్యాసినాయుడు మరియు ఇతర నాయకులు శాలువాలు, గజమాలలతో సత్కరించి గంటా నూకరాజుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టిన దగ్గర నుండి నేటివరకు ఒకే రాజకీయ పార్టీలో ఉంటూ సేవలు అందించానని అన్నారు. నాసేవలు గుర్తించి పార్టీ అధిష్టానం రాష్ట్ర కమిటీలో స్థానం కల్పిస్తూ, వివిధ నియోజకవర్గాలకు పరిశీలకునిగా నియమించిందని అన్నారు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో నాకు వెన్నంటి నిలిచిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని అన్నారు. నా గొంతులో ప్రాణం ఉన్నంతవరకు మీ సేవకే నా జీవితం అంకితమని అన్నారు. వార్డు అధ్యక్షులు గొలగాని నరేంద్ర ్రకుమార్ మాట్లాడుతూ నీతి, నిజాయితీ గల రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గంటా నూకరాజు అని అన్నారు. 2019-24 వైసీపీ ప్రభుత్వంలో కూడా పార్టీని ఒక తాటిమీదకు తెచ్చి ధైర్యం నింపారని అన్నారు. నేడు 3వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఇంత ప్రతిష్టంగా ఉందంటే గంటా నూకరాజు కృషి చాలా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు కారి అప్పారావు, కాసరపు నాగరాజు, కాసరపు ఎల్లాజీ, వాడమొదలు సత్యారావు, వియ్యపు పోతురాజు, సంకురుభుక్త జోగారావు, జలగడుగుల మురళి, రాజగిరి రమణ, నెక్కెళ్ళ వెంకటరావు, వియ్యపు నాయుడు, రేగాని శంకర్, యానాపు శ్రీను, రామాయణం ప్రసాద్ పంతులు, ఆవాల సూరిబాబు తదితర నాయకులు, వార్డు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నూకరాజు కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు.

అమరావతి రైతులకు రూ.138.46 కోట్ల వార్షిక కౌలు విడుదల

అమరావతి,(ఉషశ్రీ) జూన్ 1: ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్‌పీఎస్) 1.0 కింద స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులు, భూయజమానులకు ప్రభుత్వం వార్షిక కౌలు (అన్యుయిటీ) చెల్లింపులను కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఏపీసీఆర్డీఏ ఇప్పటివరకు 17,718 మంది రైతుల ఖాతాల్లో రూ.138.46 కోట్లను జమ చేసింది. ఎల్‌పీఎస్ 1.0 కింద మొత్తం 27,811 మంది రైతులు కౌలు చెల్లింపులకు అర్హులు కాగా, ఇందుకు రూ.214.46 కోట్ల నిధులు అవసరమవుతాయి. వీరిలో 23,932 మంది రైతులకు సంబంధించిన రూ.145.93 కోట్ల చెల్లింపులు ఇప్పటికే ఖరారయ్యాయి. మిగిలిన 3,879 మంది రైతులకు సంబంధించిన రూ.68.53 కోట్ల చెల్లింపులు ప్రస్తుతం వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నట్లు ఏపీసీఆర్డీఏ వెల్లడించింది. ఎన్‌పీసీఐ లింకేజీ సాంకేతిక సమస్యలు, ఈ-కేవైసీ ధ్రువీకరణ పెండింగ్‌లో ఉండటం, బ్యాంకు ఖాతాలు ఇనాక్టివ్‌గా మారడం, మరణించిన రైతుల వారసులు అవసరమైన పత్రాలు సమర్పించకపోవడం, ప్లాట్ల బదిలీలు లేదా విక్రయాల కారణంగా యాజమాన్య హక్కుల్లో మార్పులు రావడం వంటి కారణాల వల్ల కొన్ని చెల్లింపుల్లో జాప్యం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి బ్యాంకులు, సంబంధిత లబ్ధిదారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 2,800 ఇనాక్టివ్ ఎన్‌పీసీఐ ఖాతాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించిన మొత్తం రూ.30.41 కోట్లుగా ఉందన్నారు. ఈ ఖాతాల జాబితాను ఏపీసీఆర్డీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, సంబంధిత రైతులు తమ ఈ-కేవైసీ పూర్తి చేసి, బ్యాంకు ఖాతా వివరాలను నవీకరించుకోవడంతో పాటు ఎన్‌పీసీఐ లింకేజీని పునరుద్ధరించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్, బ్యాంకింగ్ ప్రక్రియలు పూర్తయిన వెంటనే అర్హులైన రైతులందరికీ కౌలు చెల్లింపులు అందజేస్తామని, పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఏపీసీఆర్డీఏ స్పష్టం చేసింది.

స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన డిఎస్సి అభ్యర్థుల జాబితాను వెల్లడించాలి

విశాఖపట్నం, ఉష శ్రీ: "జాతిని తాకట్టు పెట్టి పదవులు తెచ్చుకునే నాయకులు కాదు.. జాతి కోసం పదవులను తృణప్రాయంగా వదులుకునే నిజాయితీ గల నాయకులు మనకు కావాలి" అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోరుకునే వారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. 1956లో లాల్ బహదూర్ శాస్త్రి రైల్వే మంత్రి గా పనిచేశారన్నారు. ఆ తరుణంలో రైలు ప్రమాదం సంభవిస్తే.. నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశారని ప్రస్తావించారు. అయితే దురదృష్టవశాత్తు ప్రస్తుత రోజుల్లో నైతికత కోసం పదవులను వదులుకునే నాయకులు ఎవరూ కనిపించడం లేదన్నారు. సోమవారం ఉదయం సమీపంలోని ఎల్ఐసి భవనం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డీఎస్సీ పరీక్షలు సజావుగా కొనసాగాయని, స్పోర్ట్స్ కోటాలో భాగంగా ఎంపికైన అభ్యర్థులు అందరూ నిజాయితీగా ఎంపికైన వారేనని.. మంత్రి నారా లోకేష్ స్పష్టం చేయాలన్నారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన వారి జాబితాను 48 గంటలలోగా మీడియాకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక వేళ ఆ జాబితాను విడుదల చేయకపోతే... స్కామ్ జరిగినట్టుగా మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అందుకని అంగీకరించి నట్టుగా భావించాల్సి ఉంటుందన్నారు. 16,547 పోస్టులకు గాను మూడు లక్షల 36 వేల మంది డీఎస్సీ పరీక్షలు రాశారని.. వీరందరి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని డీఎస్సీ పరీక్షల నిర్వహణ ఫలితాలకు సంబంధించి సీబీఐ చే విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను కోరారు. నిజా నిజాలు తేలే వరకు మీ సహచర మంత్రి నారా లోకేష్ ను సంబంధిత మంత్రి పదవి నుంచి పక్కన పెట్టాలన్నారు. డీఎస్సీ స్కామ్ ద్వారా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న వ్యక్తి ఎవరో తక్షణమే తెలియాల్సి ఉందన్నారు. 2019 నుంచి 2024 వరకు ప్రకృతి మురళీ కృష్ణ అనే వ్యక్తి ఎక్కడ ఉన్నాడు... 2024 జూన్ 12 నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ తో ఎలా సన్నిహితంగా మెలుగుతున్నారన్నారు. ఆ కీలకమైన వ్యక్తి స్కాం కు సూత్రధారి కావచ్చు అని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అభిప్రాయపడ్డారు.

ఓణీల వేడుకల్లో పాల్గొన్న పువ్వాడి, బొల్లా,అడుసుమల్లి

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ పామూరు మండల టిడిపి మాజీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు మనుమరాలు కల్వకూరి డా. భాస్కర్ డా. హిందూ మాధవి గార్ల కుమార్తె ఓణీల వేడుక ఆదివారం కర్నూల్ మహానగరంలో అత్యంత వైభవంగా, సాంప్రదాయకంగా జరిగింది. సాంప్రదాయ పట్టు వస్త్రాలు, ఆభరణాలతో ముస్తాబైన చిన్నారి వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేద పండితుల మంత్రోచ్ఛారణాల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో అమ్మాయికి ఓణీలను సమర్పించి,పెద్దలు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు నృత్యాలు చేసి, పాటలు పాడుతూ వేడుకను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంప్రదాయ విందు భోజనంలో అతిథులందరూ పాల్గొన్నారు. ఈ మధురమైన ఘట్టాన్ని అందరూ గుర్తించుకునేలా ఫోటోలు వీడియోల ద్వారా బంధించారు . ఈ కార్యక్రమానికి టిడిపి మండల మాజీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, పట్టణ అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, పువ్వాడి వెంకటేశ్వర్లు (ప్రముఖ బిల్డర్ బెంగళూరు) తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి లో రాహు, కేతు పూజలో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ పంచభూత లింగాలలో ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి వాయు లింగం ను ఆదివారము కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానంలో రాహు, కేతు పూజ అనంతరము జ్ఞాన ప్రసునాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు స్వామి వారి పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. దారపనేని రాజేంద్రప్రసాద్, మిరియం సుబ్బరాయుడు, కౌలూరి ఖాజా రంతుల్లా, జాజం హరికృష్ణ పూజలో పాల్గొన్నారు.

శ్రీ పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం లో పాల్గొన్న యాదాల, ఇ ర్రి

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ పామూరు పట్టణంలో ఆదివారం శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్లు భక్తి శ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించగా, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయాన్నే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు . భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి పొంగళ్లు పెట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తిరుణాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయ పరిసరాలు' ఓం శక్తి"' 'పోలేరమ్మ తల్లికి జై ' అనే నినాదాలతో మార్మోగాయి. ఈ తిరునాళు పామూరు పరిసర ప్రాంతాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన కావడంతో, స్థానిక ప్రజలందరూ ఈ వేడుకలు పండగ వాతావరణం లో జరుపుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా, పాడి పంటలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. ఈ తిరునాళ్లు మహోత్సవానికి పామూరు పట్టణ మాజీ వైస్ సర్పంచ్ యాదాల సాయికిరణ్, ఇర్రి కోటిరెడ్డి, ఇర్రి హజరత్ రెడ్డి, గుత్తి రాజా, సుధాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ జి ఎస్ ద్వారా ప్రశంస పత్రం అందుకున్న పామూరు గ్రామపంచాయతీ ఈవో జి.వి అరవిందరెడ్డి

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ మార్కాపురం జిల్లా పామూరు మేజర్ పంచాయితీ లో గల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు గాను పామూరు మండలనికి చెందిన పామూరు మేజర్ పంచాయతీ, పంచాయతీ కార్యదర్శి జి వి అరవింద రెడ్డి ఆదివారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా ప్రతిష్టాత్మక ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన, పచ్చదనం-- పరిశుభ్రత పల్లె ప్రగతి / స్వచ్ఛభారత్, మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరువేయడంలో ఆమె చూపిన చొరవకు గాని ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో మాట్లాడుతూ" ఈ ప్రశంస పత్రం రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ గుర్తింపు తనతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, సర్పంచ్ మరియు గ్రామస్తులు అందరికీ తగ్గుతుంది. భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి మరింత బాధ్యతాయుతంగా కృషి చేస్తాను" అని ఆమెతెలిపారు. ఈవో ప్రతిభను గుర్తించి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

జక్కంపూడి రాజాకు సాదర స్వాగతం పలీకిన స్థానిక మాజీ ఎమ్మెల్యే శ్రీ అలజంగి జోగారావు

పార్వతీపురం ఉష శ్రీ ప్రతినిధి.జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి జూన్1:- ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా యువజన విభాగమ అధ్యక్షులు శరత్ కుమార్ అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు జక్కంపూడి రాజా కొమరాడ మండలం పరామర్శికు వెళుతున్న క్రమంలో పార్వతిపురం నియోజకవర్గ కేంద్రంలో ఆయనకు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సాధర స్వాగతం పలికి వైసీపీ క్యాడర్ అందర్నీ ఆయనకు వ్యక్తిగత పరిచయం చేయడంతో పాటు అందరి సమక్షంలో రాజాను సాలువలతో ఘనంగా సత్కరించడం జరిగినది. రాజాతో తోపాటు విచ్చేసిన పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, వైజాగ్, విజయనగరం జిల్లా యూత్ అధ్యక్షుల తో పాటు వెంటవచ్చిన పలువురు ముఖ్యులకు ఆయన సాదర స్వాగతం పలకడం జరిగినది. ఈ సందర్భంగా ఈరోజు మాజీ ఎమ్మెల్యే జోగారావు పుట్టినరోజు అని తెలుసుకున్న రాజా నాయకుల సమక్షంలో జోగారావు గారితో కలిసి కేక్ కట్ హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు వైసిపి ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర జిల్లా నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు సీనియర్ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసాతో ఇంటింటికీ ఆర్థిక భద్రత.

ఉదయగిరి నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు తురక వెంకటేశ్వర్లు

ఉష శ్రీ ప్రతినిధి సీతారామపురం మండలం (జూన్ 1) లబ్ధిదారులకు ఆర్థిక అండగా నిలుస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఉదయగిరి నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు తురక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు . బసినేనిపల్లి పంచాయతీలోని సంజీవరెడ్డి నగర్, కొయ్యలపాడు, గ్రామాలలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల నగదును లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మరియు ఇతర లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా తురక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుం టోందన్నారు.గత ప్రభుత్వ హయాంలో అందించిన పెన్షన్ మొత్తాన్ని పెంచడంతో పాటు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి మరింత గౌరవప్రదంగా అందించడం జరుగుతోందని తెలిపారు. సీతారామపురం మండల కన్వీన ర్ చింతల శ్రీనివాసులు సూచనలు, సలహాలతో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అలాగే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి నెలా 1వ తేదీ ఉదయం నుంచే ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.వృద్ధులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా,ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా వారి ఇంటి వద్దకే పెన్షన్ అందించడం కూటమి ప్రభుత్వం యొక్క సంక్షేమ పాలనకు నిదర్శనమని అన్నారు.ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని,సమాజంలో అట్టడుగు వర్గాలకు భరోసా కల్పించే జీవనాధారమని తెలిపారు.ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాయని, లబ్ధిదారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతులకు పచ్చి రొట్టె ఎరువులు రైతు బరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయి –ఏఓ సింఘమేశ్వర రెడ్డి

త్రిపురాంతకం ఉష శ్రీ జూన్ 01 :- త్రిపురాంతకం మండల రైతులకు మండల వ్యవసాయ అధికారి బి. సంగమేశ్వర రెడ్డి త్రిపురాంతకం మండలంలోని రైతులకు పచ్చి రొట్టె ఎరువులు అయినా జనము, జీలుగా, పిల్లిపెసారా ప్రస్తుత తొలకరి వర్షాలకు వేసుకోవాలి అని తెలిపారు పచ్చి రొట్టె పైరు వెయ్యడం ద్వారా భూమిలో సేంద్రియ పదార్థం పెంచుతుంది. నత్రజని స్థిరీకరణ ద్వారా నేల సారాన్ని మెరుగుపరుస్తుంది.పచ్చిరొట్ట ఎరువుగా, పిల్లిపేసర పశువులకు మేతగా కూడా ఉపయోగిస్తారు. అందుచేత ప్రతి రైతులు పచ్చిరొట్టె ను సాగు చేయాలని రైతులు పిలపు నిచ్చారు. త్రిపురాంతకం మండలంలో ఇప్పటివరకు జనములు 80 క్వింటలకు గాను 50క్వింటాలు రైతులు కొనుగోలు చేసారని తెలిపారు అదేవిధనుగా జీలుగా 80 కింట్వాల్ గాను 20 క్వింటాలు కొనుగోలు చేసారని, పిల్లిపేసారా పిల్లిపేసారా 35 క్విటలకు గాను 7 క్వింటలు కొనుగోలు జరిగింది అని తెలిపారు. పచ్చి రొట్టె ఎరుపు వాడటమ్ వల్ల యూరియా వాడకకం తగ్గించ వచ్చ అని తెలిపారు కావున ప్రస్తుత వర్షాల దృష్ట్యా ఇంకా ఎవరికైనా పచ్చి రొట్టె విత్తనాలు కావాలి అంటే, స్థానిక రైతు సేవ కేంద్రంకు వెళ్లి నమోదు చేయనుకోని, డబ్బులు కట్టవలను తెలిపారు. డబ్బులు కట్టిన 1 లేదా 2 రోజులలోవు మీకు విత్తనాలు ఇవ్వడం జరుగుతుంది అని, అదే విధముగా ధరలు చూసుకున్నట్లు అయితే పిల్లిపేసారా సబ్సిడీ పోను కిలో ధర 98 రూపాయలు, జీలుగా విత్తనాలు సబ్సిడీ పోను 80 రూపాయలు మరియు జనము విత్తనాలు సబ్సిడీ పోను 77 రూపాయలు అని ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనానిభివృద్ధి సంస్థ, మార్కాపురం

రాయితీ విత్తన పూర్తి ధర మరియు రాయితీ వివరములు (బ్రీడ్స్ - 2026)

(ధర రూపాయలలో)

క్రమ సంఖ్య	పంట / రకం	ప్యాకింగ్ పరిమాణం కిలోలలో	పూర్తి ధర/కిలో	రాయితీ ధర/కిలో	రైతు చెల్లించవలసిన ధర / కిలో	పూర్తి ధర/ప్యాకెట్	రాయితీ ధర/ ప్యాకెట్	రైతు చెల్లించవలసిన ధర/ ప్యాకెట్
GENERAL SUBSIDY								
1	జీలుగ	10	160.00	80.00	80.00	1600.00	800.00	800.00
2	కొత్త జనుము	10	154.00	77.00	77.00	1540.00	770.00	770.00
3	పిల్లి పెసర	8	196.00	98.00	98.00	1568.00	784.00	784.00

జిల్లా మేనేజర్ (సీడ్స్)
ఎ.పి.ఎస్.ఎస్.డి.సి. లిమిటెడ్
మార్కాపురం జిల్లా

డా. ఎం వై కే యాదవ్ కీర్తి కిరీటంలో మరో జాతీయ అవార్డు.

- పూల సిద్దయ్య నటనకు "నటరత్న" ఎన్టీఆర్ జాతీయ అవార్డు.
- సాంస్కృతిక కళా రంగాలకు చెందిన పలువురు తెలిపిన అభినందనలు.

ఒంగోలు: శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకములో పూల సిద్దయ్య పాత్రలో జీవించి నటించిన ఒంగోలు నగరం, నేతాజీ కాలనీ ప్రాంత నివాసితులు, ఎస్ వి ఎస్ టి సాంస్కృతిక సేవా కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి డా. మద్దిన ఏడుకొండలు యాదవ్ (ఎం వై కె యాదవ్)కు మే 30వ తేదీన వైజాగ్ లోని ద్వారకానగర్, పౌరగ్రంధాలయములో శ్రీ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ విశాఖరత్న కళాపరిషత్ ఆధ్వర్యములో నటరత్న నందమూరి తారకరామారావు 103వ జయంతి మరియు దర్శకరత్న దాసరి నారాయణరావు 80వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన జాతీయ అవార్డుల పురస్కార వేడుకలలో నటరత్న నందమూరి తారకరామారావు జాతీయ అవార్డును సినీనటులు, నిర్మాత పసన్న కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ డా. దాడి సత్యనారాయణ, కాకినాడ సంగీత సామ్రాట్ ఫౌండర్ డా. ఈ.వి కృష్ణమాచార్యులు, సినీ దర్శకులు డా. దుగ్గవలస దివాకర్ మరియు ఆర్టిస్ట్ సోషల్ ఆక్టివిస్ట్ డా. తుంకా సుర్యారావుల చేతులమీదుగా బహుకరించారు. ఈ వేదికపై పలువురికి నటరత్న నందమూరి తారక రామారావు జాతీయ అవార్డు, దర్శకరత్న దాసరి నారాయణరావు జాతీయ అవార్డు, కొందరికి ఉత్తమ సేవా అవార్డుని, జాతీయ సేవా పుష్కరాలను మరో కొందరికి జంతు సంరక్ష, నృత్యరత్న, అవార్డులను బహుకరించారు. పురస్కార ప్రదానం అనంతరం సకల కళలైన నృత్య, డప్పు, బుర్రకథ, చెక్క భజన, మిమిక్రీ, జానపద నృత్య ప్రదర్శనలు సభికులను అలరించాయి. ఈ సందర్భంగా డా. మద్దిన ఏడుకొండలు యాదవ్ కు ఒంగోలు నగరంలోని సాంస్కృతిక కళా రంగాలకు చెందిన పలువురు అభినందనలు తెలిపారు. డా. మద్దిన ఏడుకొండలు మాట్లాడుతూ సామాజిక సాంస్కృతిక అభివృద్ధికి, ఆయా రంగాలలో నిష్ణాతులైన కళాకారులను ఒక దగ్గర చేర్చి వారిని అభినందిస్తూ జాతీయ అవార్డులు అందించడం విశాఖరత్న కళాపరిషత్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

శ్రీశైలం మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

● భక్తుల రద్దీ దృష్ట్యా శ్రీ స్వామివారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి..! ● ముందుగానే ఆన్లైన్లో స్పర్శ దర్శనం టికెట్స్ పొందిన భక్తులకు మాత్రమే యధావిధిగా స్పర్శ దర్శనం కొనసాగింపు..! ● వేసవి సెలవులు,వారాంతపు సెలవులు భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ముందస్తుగా ఈ ఓ శ్రీనివాసరావు కీలక నిర్ణయం..! ● స్వామి అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునేందుకు దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు..! ● భక్తుల రద్దీ దృష్ట్యా శని,ఆది, సోమవారాలలో ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చనలు నిలుపుదల చేసిన అధికారులు..! ● ఉచిత, శీఘ్ర,అతిశీఘ్ర,దర్శనాల క్యూలైన్ల ద్వారా భారీగా స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నా భక్తులు..! ● ఆన్లైన్లో విఐపి బ్రేక్ దర్శనం టికెట్లు బుక్ చేస్తున్న భక్తులకు 2 విడతలుగా స్పర్శ దర్శనానికి అనుమతి ఇస్తున్న అధికారులు..! ● శ్రీస్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు 5 గంటల సమయం పడుతుంది..!

శ్రీశైలం దేవస్థానం ఉష శ్రీ జూన్:01: నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తులు సందడి నెలకొంది వేసవి సెలవులు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నారు శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భారీగా తరలివస్తున్నారు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి స్వామి అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునేందుకు దర్శనానికి భారీగా తరలి వచ్చిన భక్తులు భక్తుల రద్దీ దృష్ట్యా శ్రీ స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ముందుగానే ఆన్లైన్లో స్పర్శ దర్శనం టికెట్స్ పొందిన భక్తులకు మాత్రమే యధావిధిగా స్పర్శ దర్శనానికి మాత్రమే కొనసాగింపు వేసవి సెలవులు వారాంతపు సెలవులు కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ముందస్తుగా శ్రీనివాసరావు కీలక నిర్ణయం క్షేత్రమంత భక్తజనంతో సందడి వాతావరణం నెలకొంది భక్తులు వేకువజామున నుండే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల దర్శనార్థమై క్యూలైన్స్ లో దర్శన కంపార్టుమెంట్లలో బారులు తీరారు శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు 5 గంటల సమయం పడుతుంది మరోపక్క భక్తులు రద్దీ దృష్ట్యా శని,ఆది, సోమవారలో ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చన నిలుపుదల చేసిన అ దర్శనానికి క్యూలైన్ల ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు ,ఆన్లైన్లో విఐపి బ్రేక్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు 2 విడతలుగా ఉదయం 7:30 రాత్రి 9 గంటలకు మాత్రమే స్పర్శ దర్శనానికి అనుమతిస్తున్న అధికారులు,భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకునేలా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు దర్శనార్థమై క్యూలైన్లు,కంపార్ట్మెంట్లలో ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు అల్పాహారం,బిస్కెట్స్ మంచినీరు అందిస్తున్నామని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు

లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు

శ్రీశైలం దేవస్థానం ఉష శ్రీ జూన్: 01: లోక కల్యాణార్థం పంచమఠాలలో సోమవారం ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించారు విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించారు అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయనో ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుందని ఆలయ అధికారులు మీడియాకు తెలిపారు

మనసు పెట్టి అర్జీలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పార్వతీపురం ఉష శ్రీ పతినిధి .ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి, జూన్ 1 : ప్రజల నుంచి వచ్చే అర్జీలను కేవలం ఒక విధిగా కాకుండా, మనసు పెట్టి, బాధ్యతాయుతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులకు హితవు పలికారు. అర్జీదారుల సమస్యల పరిష్కారం అయిన వెంటనే, అర్జీదారుడు సంతృప్తి చెందినదీ, లేనిదీ జిల్లా అధికారే స్వయంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజల ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన 71 మంది అర్జీదారుల నుంచి స్వయంగా వినతులను కలెక్టర్ స్వీకరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసమే ఎంతో ఆశతో కలెక్టరేట్‌కు వస్తారని, వారి అర్జీలపై సానుకూలంగా స్పందించి నిర్దేశిత కాలపరిమితిలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కాగా అందిన వినతుల్లో 63 సాధారణ అర్జీలు ఉండగా, రెవిన్యూ సమస్యల పరిష్కారం కోరుతూ 8 అర్జీలు అందాయి.

108 అంబులెన్స్ తనిఖీ

ఉష శ్రీ ప్రతినిధి సీతారామపురం మండలం (జూన్ 1) ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు సీతారామపురంలోని 108 అంబులెన్స్‌ను ఆత్మకూరు డివిజన్ సూపర్ వైజర్ చిరంజీవి సోమవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలు, మందులు, ఆక్సిజన్ సిలిండర్లు, సిబ్బంది సన్నద్ధతను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచనలు చేశారు.అంబులెన్స్ నిర్వహణ, సేవల ప్రమాణాలపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఈఏంటి వెంకట శ్రీనివాసులు, పైలెట్ సురేంద్ర ఉన్నారు.

అప్పన్న స్వామి నిత్య అన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం..

(సింహాచలం , జూన్ 1, ఉష శ్రీ) సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్య అన్నదాన పథకానికి విశాఖ జిల్లా హనుమంతువాక ప్రాంతానికి చెందిన పెచ్చెట్టి రాంబాబు దంపతులు ఒక లక్షా వెయ్యి 116 రూపాయలు విరాళంగా అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,01,116 విరాళాన్ని ఆలయ ఈవో జల్లేపల్లి వెంకట్రావు కు అందజేశారు. స్వామి వారిపై భక్తిశ్రద్ధలతో ఈ విరాళాన్ని నిత్య అన్నదాన పథకానికి ఇచ్చినట్లు రాంబాబు తెలిపారు. భక్తులు అందిస్తున్న విరాళాలు దేవస్థానంలోని సేవా కార్యక్రమాల నిర్వహణకు ఎంతో దోహదపడుతున్నాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు. దాత కుటుంబ సభ్యులకు దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేదాశీర్వచనం అందించి,అప్పన్న చిత్రపటం, ప్రసాదాలు, రసీదు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత రాంబాబు కుటుంబ సభ్యులు పద్మావతి, లవ కుమార్,రోహిణి, హరీష్, ఆలయ పిఆర్ఓ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేసిన మండల ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ పామూరు పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ గౌస్ ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజీ గౌస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఈ పింఛన్లు ఆర్థికంగా ఎంతో భరోసానిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీస్ దాడి

ఉష శ్రీ పామూరు ప్రతినిధిరజియా సయ్యద్ పామూరు పట్టణంలో విరాట్ నగర్ సమీపాన పేకాట స్థావరాలపై దాడులు చేసి ఐదుగురు వ్యక్తులు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న రూ.21350.నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పామూరు సబ్ ఇన్స్పెక్టర్ కట్ట అనూక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేపట్టిన మండల మహిళా ప్రధాన కార్యదర్శి రజియా సయ్యద్

ఉష శ్రీ పామూరు ప్రతినిధిరజియా సయ్యద్ పామూరు పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల మహిళా ప్రధాన కార్యదర్శి రజియా స్వయంగా పాల్గొని, లబ్ధి గారు ఇంటింటికి వెళ్లి వృద్ధులు, వితంతువులు, దివ్యంగులకు పెన్షన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు సకాలంలో అందాలని లక్ష్యంతో రజియా సయ్యద్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందేలా ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు సాయం చేయడం ప్రభుత్వానికి, పార్టీకి అత్యంత ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు మహిళ నాయకులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్లు పంపిణీ చేసిన గంటా

భీమునిపట్నం, ఉష శ్రీ సంక్షేమ పథకాల అమలు ద్వారా పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. సాగర్ నగర్ లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. పెన్షన్లు, జీతాలు ప్రతి నెల 1 వ తేదీన క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామన్నారు. ప్రతి నెల రాష్ట్రవ్యాప్తంగా 62.34 లక్షల మందికి రూ. 2,728 కోట్లు నేరుగా నగదు పెన్షన్ల రూపంలో అందిస్తున్నా మని.. భీమిలి నియోజకవర్గంలో 14 వేల మందికి రూ.6.34 కోట్లు ఇస్తున్నామని వివరించారు. ఈనెల స్పెజ్ కోటాలో 5606 మంది వితంతువులకు సామాజిక పెన్షన్లు అందించామన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేర్చి వారి నమ్మకం గెలుచుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, చెట్టుపల్లి సన్యాసిరావు, శాఖారి శ్రీనివాస్, లొడగల అప్పారావు, సారిపల్లి శ్రీనివాస్, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు - మోపాడు రిజర్వాయర్ వైస్ చైర్మన్ మోరబోయిన నరసింహారావు

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ పామూరు మండల కేంద్రమైన మోపాడు గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే తమ లక్ష్యం అని మోపాడు రిజర్వాయర్ వైస్ చైర్మన్ మోరబోయిన నరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు మెరుగైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ల మొత్తాన్ని అందజేశారు . ఈ కార్యక్రమంలో మోపాడు రిజర్వాయర్ వైస్ చైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ.. పేద వృద్ధులు, మరియు దివ్యంగుల సంక్షేమ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రతి నెల ఒకటో తేదీని పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ఎవరు కూడా సంక్షేమ పథకాలకు దూరంగా ఉండకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం పారదర్శకంగాసేవలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు,కార్యకర్తలు సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు - మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచుకొండయ్య

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ పామూరు మండల కేంద్రమైన మోపాడు గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే తమ లక్ష్యం అని మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచుకొండయ్య స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు మెరుగైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ల మొత్తాన్ని అందజేశారు . ఈ కార్యక్రమంలో చుంచు కొండయ్య మాట్లాడుతూ.. పేద వృద్ధులు, మరియు దివ్యంగుల సంక్షేమ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రతి నెల ఒకటో తేదీని పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ఎవరు కూడా సంక్షేమ పథకాలకు దూరంగా ఉండకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం పారదర్శకంగాసేవలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీశైలం సత్ర సంఘాల సమైక్య అధ్యక్షుడిగా దేవకి వెంకటేశ్వర్లు ఎన్నిక

ఉష శ్రీ ప్రతినిధి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులకు నిరంతరం సేవలు అందిస్తున్న సత్రాల నిర్వహణలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీశైలంలోని స్థానిక అన్నపూర్ణ సత్రంలో నిర్వహించిన సత్ర సంఘాల సమైక్య సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ క్షేత్రస్థాయి సమావేశంలో క్షేత్ర పరిధిలోని అన్ని సత్రాలకు సంబంధించిన పెద్దలు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా శ్రీశైలంలో నిత్యం వచ్చే వేలాది మంది భక్తులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తూ సేవలందిస్తున్న మొత్తం 53 సత్ర సంఘాల సమైక్య నూతన అధ్యక్షుడిగా దేవకి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈయన స్థానిక వాసవి సత్ర సముదాయాల అధ్యక్షుడిగా, అలాగే శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు ఉన్న అనుభవం, సేవాతత్పరతను గుర్తించి సత్రాల పెద్దలంతా కలిసి ఈ బాధ్యతను అప్పగించారు. దేవకి వెంకటేశ్వర్లు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల క్షేత్రంలోని పలువురు ప్రముఖులు, భక్తులు, వివిధ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేశార

సామాజిక పెన్షన్లు లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

బుట్టాయిగూడెం (ఉష శ్రీ) జూన్ 01 రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న సామాజిక పెన్షన్ పథకం వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు అన్నారు. సోమవారం జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి సామాజిక పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన ఉదయం నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేయడం ద్వారా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో పెన్షన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, సమయపాలనతో పెన్షన్లను ఇంటి వద్దకే అందించి ప్రజల హృదయాలను గెలుచుకుంటోందని పేర్కొన్నారు. సామాజిక పెన్షన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, వృద్ధులు మరియు బలహీన వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసా అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి నెలా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ అందడం తమకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

కదిరిలో కొత్త సేవ ప్రారంభం – కాల్ చేస్తే చాలు... సమస్యకు పరిష్కారం

ప్రజల గొంతుకగా 'వాయిస్ ఆఫ్ సిటిజన్' – ఎమ్మెల్యే కందికుంట వినూత్న ఆలోచన

కదిరి (ఉష శ్రీ) జూన్ 01 కదిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి సాంకేతికతను వినియోగిస్తూ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. "వాయిస్ ఆఫ్ సిటిజన్" పేరుతో రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటిసారిగా ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించడమే లక్ష్యంగా కొనసాగనుంది. "మీ సమస్య మా బాధ్యత -- మీ సమస్యకు పరిష్కారం మా కర్తవ్యం" అనే నినాదంతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ సమస్యలను తెలియజేయడానికి ప్రత్యేక కాల్ సెంటర్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎగ్జిక్యూటివ్‌తో మాట్లాడేందుకు 04048210053 నంబర్‌కు కాల్ చేయవచ్చు. అలాగే 04045210910 నంబర్‌కు కాల్ చేసి ఏఐ ఆధారిత తెలుగు వాయిస్ బాట్ ద్వారా కూడా సమస్యలను నమోదు చేయవచ్చు. ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 'వాయిస్ ఆఫ్ సిటిజన్' ప్రచార రథాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు నియోజకవర్గ నాయకులు కలిసి జెండా ఊపి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ పదో తరగతి టాపర్లకు ఆకాశయానం

తలుపుల (ఉష శ్రీ) జూన్ 01 మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అగ్రస్థానంలో నిలిచిన ఆరుగురు విద్యార్థులకు జీవితంలో మరపురాని అనుభవం లభించింది. ఆదివారం కడప విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు విమానంలో ప్రయాణించే అవకాశం కల్పించారు. ఫ్రెండ్స్ ట్రస్ట్ చైర్మన్ మన్సూర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. మండల వ్యవసాయ అధికారి నాగ మధుసూదన్ పూర్తి ఆర్థిక సహకారంతో పాటు, ట్రస్ట్ సభ్యులు మరియు సైన్స్ ఉపాధ్యాయుడు తలమర్ల ప్రభాకర్ సహకారంతో ఈ ప్రయాణాన్ని ఏర్పాటు చేశారు. విమాన ప్రయాణంతో పాటు హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రదేశాలను విద్యార్థులు సందర్శించి, మంగళవారం తిరిగి తలుపుల చేరుకోనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, "విమానాన్ని ఇప్పటివరకు ఆకాశంలో మాత్రమే చూశాం. జీవితంలో తొలిసారి విమానంలో ప్రయాణించడం ఎంతో ఆనందంగా ఉంది" అని తెలిపారు. ఈ అనుభవం తమ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల ప్రోత్సాహానికి ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కోరారు.

పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి - సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డిమాండ్

బుట్టాయిగూడెం (ఉష శ్రీ) జూన్ 01 కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ మరియు నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుట్టాయిగూడెం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం మండల ఎమ్మార్వోకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు కారం రాఘవ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కన్వీనర్ తగరం బాబురావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. వాణిజ్య గ్యాస్ ధరలను ఒక్కసారిగా పెంచడంతో చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని అన్నారు. కృష్ణా-గోదావరి బేసిన్ గ్యాస్‌లో రాష్ట్రానికి వాటా ఇవ్వాలని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవేర్చకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ర్యాలీ స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై ఎమ్మార్వో కార్యాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ ముఠా పై ఉక్కుపాదం

బంగారుపాళ్యం (ఉష శ్రీ) జూన్ 01 గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ అక్రమ దందాపై బంగారుపాళ్యం పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఇప్పటికే నమోదైన కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితులు బి. సుధాకర్ రెడ్డి, సి. నాగరాజును ప్రత్యేక గాలింపుతో అరెస్ట్ చేశారు. ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, తాజా అరెస్టులతో మొత్తం ఆరుగురు అదుపులోకి వచ్చారు. నిందితులు గర్భిణీ స్త్రీల నుంచి ఒక్కొక్కరికి రూ.10,000 వసూలు చేస్తూ మోసపూరితంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తేలింది. దర్యాప్తులో 14 మంది గర్భిణీలు బాధితులుగా గుర్తించగా, ఒక అల్ట్రాసౌండ్ యంత్రం, ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. కేసుపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

ఉపా తపాలా కార్యాలయంలో సుభానీకి ఘన సన్మానం

పుల్లలచెరువు (ఉష శ్రీ) జూన్ -1 మండల కేంద్రంలోని ఉప తపాలా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్.కే. మహమ్మదు సుభానీ పదవీ విరమణ సందర్భంగా సోమవారం తోటి సిబ్బంది, జీడీఎస్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ప్రస్తుత సబ్ పోస్ట్ మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ సబ్ పోస్ట్ మాస్టర్ అనిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభానీ 43 సంవత్సరాల 2 నెలల పాటు పోస్టల్ శాఖలో సుదీర్ఘ సేవలు అందించిన విషయాన్ని సహోద్యోగులు గుర్తు చేసుకున్నారు. తన ఉద్యోగ జీవితమంతా నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. పోస్టల్ డిపార్ట్మెంట్‌లో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న సుభానీపై ఉన్నతాధికారులకు సైతం ప్రత్యేక నమ్మకం ఉండేదని, కార్యాలయానికి సంబంధించిన పలు అంశాలను ఆయనతో పంచుకుని సూచనలు తీసుకునేవారని పేర్కొన్నారు. అలాగే కార్యాలయ పరిధిలో పనిచేస్తున్న జీడీఎస్ ఉద్యోగుల సంక్షేమం కోసం యూనియన్ పరంగా నిరంతరం కృషి చేశారని, అవసరమైన సమయంలో అందరికీ అండగా నిలిచి సహాయ సహకారాలు అందించారని సహోద్యోగులు ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు సుభానీ సేవలను స్మరించుకుంటూ ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు

ఉపాధి హామీలు కాపాడుకుందాం

- ఎస్సీలకు వంద రోజులు పని దినాలు కల్పించాలి
- రాష్ట్ర వ్యవసాయ కూలీ సంఘం అధ్యక్షురాలు – డి రమాదేవి

త్రిపురాంతకం ఉష శ్రీ జూన్ 01 :- త్రిపురాంతకం మండలంలోని పాత మూడువేల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ కూలీల పనితీరును వారితో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు సోమవారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ కూలీల సంఘం అధ్యక్షురాలు డి రమాదేవి స్వయంగా పరిశీలించి వారితో మాటా మంచి కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె వారితో పని జరుగుతున్న తీరును వందరోజుల పరిధిలో గురించి ఒక్కొక్కరికి ఉపకార వేతనం వారానికి ఎంత నమోదు అవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు అంతేకాకుండా పని ప్రదేశాన్ని పరిశీలించినప్పుడు వారం రోజులుగా అక్కడ పని ప్రదేశంలో పనిచేస్తున్నప్పటికీ పనిచేసిన ఆనవాళ్లు కొంచెం కూడా కనబడకపోవడంతో ఆశ్చర్యానికి లోనయ్యారు ఈ సందర్భంగా ఆమె వారితో మాట్లాడుతూ పనిచేయకుండా ఉపకార వేతనం పొందినట్లయితే కొద్ది రోజులకు ఉపాధి హామీ కనుమరుగైపోతుందని ఇప్పటికే దాని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పన్నాగాలు పన్నుతున్నాయని దానిలో భాగంగానే ఉపాధి హామీ మొదలుపెట్టడం జనాల్లో ఉన్నటువంటి అనేక సౌకర్యాలను అనగా పని ప్రదేశంలో మజ్జిగ మంచినీళ్లు టెంట్ ఫస్ట్ ఐడి కిట్లు మంజూరు చేసే వారిని అంతేకాకుండా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గడ్డపారులు అందించే వారిని ప్రతి 300 రూపాయలకు 50 రూపాయలు కలిపి వేతనంగా ఇచ్చేవారని ఇవన్నీ కూడా ప్రస్తుతం ఎత్తివేయడం జరిగిందని అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం వాటా 90% గా ఉండేది 60% గా తగ్గించుకొని రాష్ట్ర ప్రభుత్వాల వాటా 40% గా కేటాయించినప్పుడు కేటాయించడంతో ఉపాధి హామీ కూలీల వేతనాలు బకాయిలుగా మిగిలిపోతున్నాయని ఆమె వారికి క్షుణ్ణంగా వివరించారు కనుక ఉపాధ్యాయుని పథకాన్ని నిర్మించడం కలిసికట్టుగా పనిచేసుకొని తమకు తమ గ్రామాలకు తమ కుటుంబాలకు పోషణ అందించే విధంగా ఉపాధి హామీ కూలీలు పని చేయాలని ఆమాహితో పలికారు అనేక చోట్ల తన పరిశీలనలో దళితులకు వంద రోజులు పని జనాలు కల్పించకుండా చూపిస్తున్నారని అధికారులు దీనిపై దృష్టి సారించి దళితులకు వంద రోజులు పనులు అందే విధంగా చూడాలని ఆమె అధికారులను హెచ్చరించారు. అనంతరం ఆమె వారానికి వేతనాలు అందుతున్నాయా లేదా అని అందితే వారానికి బస్టాండ్ నమోదు అవుతుందని ఆమె అడగగా ఉపాధి హామీ కూలీలతో తమకు 1000 నుండి 1200 మాత్రమే అందుతున్నాయని అంతేకాకుండా పనికి వచ్చినవారు 300 నుండి 400 రూపాయలు ఇస్తేనే మాస్టర్ నమోదు అవుతుందని ఇది మండలంలో మొత్తం ఈ విధంగానే జరుగుతూ ఉండడంతో ఏమి చేయలేక వేతనాలు పడిన పడకపోయినా ముందుగానే మేము ఉపాధి హామీ సిబ్బందికి ఇస్తున్నామని కొందరు ఆమె ముందు వాపోయారు గుడివాడ గ్రామంలో కొంతమంది దళితులు తమకు స్మశాన సమస్య ఉందని స్మశాన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మాకు న్యాయం చేయాలని ఆమె కోరారు అనంతరం త్రిపురాంతకంలో ఎర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రిలో వేతనాలు అన్నది బొందలపాటి సుమలత గడపలను బుజ్జి సుజాత కురవయ్య అనువారు తమ తమ మూడు సంవత్సరాలు పని చేయించుకుని చెల్లించకుండా తమ జోబులో వేసుకొని చివరకు ఉద్యోగంలో నుండి తీసివేశాడని ఆమె ముందు గోడు వెళ్ళబోసుకొనగా ఆమె స్పందించి దీనిని ఉన్న స్థాయి అధికారులు దృష్టితో పాటు లేబర్ కమిషన్ ఎదుట ఈ సమస్య నుంచి మీ సమస్యకు పరిష్కారం కనుగొనటానికి తెలిపారు

త్రిపురాంతకం ఆలయాలను సందర్శించిన హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు,విశ్రాంత ఐఏఎస్

త్రిపురాంతకం ఉష శ్రీ శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానములు జూన్ 01 :- రాష్ట్ర హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు చైర్మన్‌గా దాసరి శ్రీనివాసులు విశ్రాంత ఐఏఎస్ సోమవారం త్రిపురాంతకం ఆలయాలు శ్రీ మత్ బాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారి ఆలయం శ్రీ పార్వతీ త్రిపురాంబ సమేత శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి ఉభయ ఆలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆలయాల కార్యనిర్వహణాధికారి దొంతా అనిల్ కుమార్ ఆలయాల ప్రధాన అర్చకులు దూపాటి పాలంక ప్రసాద్ శర్మ ,దూపాటి విశ్వ నారాయణ శాస్త్రి లు ఆలయాల సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ఉభయ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శేష వస్త్రాలు బహుకరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తదుపరి ఆలయాల పరిశుభ్రత ఆలయాల నిర్వహణా తీరు ఆలయాల ఈ ఓ దొంతా అనిల్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. ఆలయాల కామన్ గుడ్ ఫండ్ నిధుల నిర్వహణ విషయాల తెలుసుకొని ఆలయాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. కుమార గిరి త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయాల గాలి గోపురాలు ఆలయాల విశిష్టత గూర్చి తెలుసుకొని ఆలయాలకు సహకారం కావాలంటే తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం 20సూత్రాల ప్రోగ్రాం చైర్మన్ లంక దినకర్ ఉభయ దేవస్థానము లు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించియున్నారు. వీరి వెంట స్థానిక బిజెపి నాయకులు సముద్రాల ముని మల్లికార్జున ,కోండ్రు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు,విశ్రాంత ఐఏఎస్ తో పాటు కొండలు ,హెచ్చిపిటి సభ్యులు యామర్తి ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

కలనూతల గ్రామంలో గోకులం షెడ్లను ప్రారంభించిన ఎరిక్షన్ బాబు

పెద్దారవీడు ఉష శ్రీ జూన్ 1:- మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం కలనూతల గ్రామంలో వికసిత్ భారత్ ఉపాధి జీవనోపాధి హామీ మిషన్లో భాగంగా కలనూతల గ్రామంలో రూ. 4 లక్షల నిధులతో నిర్మించి పూర్తి చేసిన రెండు గోకులం షెడ్లను ప్రారంభించిన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ గోకులం షెడ్లతో పశువులకు సురక్షితమైన ఆవాసాలు లభించడమే కాక, పశుపోషకుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆయన తెలిపారు. పాడి రైతులను ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు ఎంపీడీఓ ఎస్. జాన్ సుందరం, పెద్దారవీడు మండల పార్టీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కలనూతల గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీడీఓ మరియదాసు

పుల్లల చెరువు ఉష శ్రీ జూన్ -1 మండల కేంద్రంలోని ఎస్సీ పాలెం మరియు సుగాలి తండాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ మరియదాసు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పింఛన్ పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తూ లబ్ధిదారులతో ముఖ ముఖి నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎంపిడిఓ మరియదాసు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ టెలిఫోన్ సిస్టమ్.కాల్ వ్యవస్థ గురించి వివరించారు. పింఛన్ అందుకున్న లబ్ధిదారులకు వచ్చే ఆటోమేటెడ్ టెలిఫోన్ సిస్టమ్ కాల్‌కు సరైన సమాచారం ఇవ్వాలని సూచించారు. పింఛన్ పంపిణీపై ప్రభుత్వం అభిప్రాయాలను సేకరించేందుకు ఈ కాల్స్ ఉపయోగపడతాయని తెలిపారు. లబ్ధిదారులు ఎలాంటి సందేహాలు లేకుండా కాల్‌కు స్పందించి తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. పింఛన్ పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా, సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ మరియదాసు పేర్కొన్నారు

సుండిపెంట గ్రామంలో మలేరియా మాసోత్సవాలు

శ్రీశైలం మండలం ఉష శ్రీ జూన్: 01: సంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సుండిపెంట గ్రామంలో మలేరియా మాసోత్సవ సందర్భముగా గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ ఆధ్వర్యంలో సోమవారం జనరల్ స్ప్రింగ్ ప్రారంభించడం జరిగినది ఐటీడీఏ పిఓ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది జూన్ జూలై మాసంలో వర్షాలు అధికంగా వర్షాలు కురుస్తాయి కనుక ప్రతి ఇంటా ఇంటింటా ఈ సీఎం 5% పిచికారి చేయించి దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ సబ్ యూనిట్ ఆఫీసర్స్ కృష్ణారెడ్డి విజయ్ కుమార్ రామలింగారెడ్డి హెల్త్ సూపర్వైజర్స్ డి బాల నర్సయ్య పి వెంకటన్న హెల్త్ అసిస్టెంట్స్ రాములు నాయక్ నాగులు నాయక్ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఒంగోలు ఉష శ్రీ 2026. జూన్ 1 గోగినేని రామారావు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఆదేశాల మేరకు స్థానిక 35వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడిందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వికలాంగులు మరియు నిరుపేద కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వృద్ధాప్య పెన్షన్ రూ. 4,000, వికలాంగుల పెన్షన్ రూ. 6,000, పూర్తిగా మంచానికే పరిమితమైన బాధితులకు రూ. 15,000 అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడు తున్నాయని పేర్కొన్నారు. పెన్షన్ లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం వల్ల తమ వైద్య ఖర్చులు, నిత్యావసర అవసరాలు తీర్చుకోవడంలో ఎంతో ఉపశమనం కలుగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న నారా చంద్రబాబు నాయుడు కి, కూటమి ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎస్-ఎస్ సభ్యులు మారెళ్ళ నాగలింగేశ్వరరావు, టీఎన్‌టీయూసీ నాయకులు నాగేశ్వర్ నాయక్, వార్డు డిజిటల్ అసిస్టెంట్ సింగమనేని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. "ప్రతి ఇంటికి సంక్షేమం -- ప్రతి కుటుంబానికి భరోసా" అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గోగినేని రామారావు పేర్కొన్నారు.

గోగినేని రామారావు
టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN